శుక్రవారం
24 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:98
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)


## అమెరికా వీడుదామంటున్న భారతీయులు!

40 శాతంమంది ఆలోచన ఇదే

ట్రంప్ పరిపాలనపై 71 శాతంమంది అసంతృప్తి

అమెరికా జనాభాలో 1.5 శాతంమంది ఇండియన్స్



## భారత్, చైనాలు 'నరక కూపాలు'

**ఈ దేశాల వలసదారులు**

**'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'**

**అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ వివాదాస్పద వ్యాఖ్యలను రీపోస్ట్ చేసిన ట్రంప్**

**ఆ దేశాలు నాగరికతలకు పుట్టినిల్లు.. ట్రంప్‌నకు ఇరాన్ కౌంటర్**



వాషింగ్టన్, ఏప్రిల్ 23: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. భారత్, చైనా వంటి దేశాలను 'నరక కూపాలు' అని సంబోధిస్తూ, అక్కడి వలసదారులపై

వివరాలు2లో..

# ప్రతి ఇంటికి సోలార్

-- త్వరలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్-- అనకాపల్లికి 'సుజల స్రవంతి'

-- 6.5 గిగావాట్ల రెన్యూ సోలార్ ఇన్‌గాట్

-వేఫర్ ప్లాంటుకు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





అనకాపల్లి, ఏప్రిల్ 23: ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయకుండా... ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని... అలాగే విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జాతి నిర్మాణంలో భాగంగా రెన్యూవబుల్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం చెప్పారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు గరువారం భూమిపూజ నిర్వహించారు. రూ.5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాంబిల్లి పెట్టుబడులు పెట్టనుంది. సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ

వివరాలు2లో..

## నేడు 62 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

**-- విపత్తుల నిర్వహణ సంస్థ**




అమరావతి : రాష్ట్రంలో ఎండ తీవ్రత రోజురోజుకీ పెరుగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఇదే పరిస్థితి కొనసాగనున్నందున ప్రజలు తీవ్ర ఎండ, ఉక్కపోత, వడగాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ సూచించారు. శుక్రవారంనాడు రాష్ట్రంలోని 62 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో

వివరాలు2లో..

## అనంతలో హనీ ట్రాప్ కలకలం



**-- ఎనిమిది నెలలుగా వ్యవహారం**

**-- 20 మంది వరకుబాధితులు ఇప్పటికి తేలారు : డిఎస్‌పి**

అనంతపురం : హానీ ట్రాప్ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు అనంతపురం రూరల్ డిఎస్‌పి టి.శ్రీనివాసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.13 లక్షల నగదు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అనంతపురం రూరల్ డిఎస్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం... గార్లదిన్నె గ్రామానికి చెందిన కుంచం భాస్కర్‌రెడ్డి బెంగళూరులోని దామాజుపేటలో ఉంటున్నారు. ఆయన డ్రోన్ల ద్వారా సర్వే చేసే ఉద్యోగం చేస్తున్నారు. ఐదు మాసాల క్రితం మంగళి జయలక్ష్మి అనే మహిళ ఆయనకు ఫోన్ చేసి డ్రోన్ ద్వారా సర్వే చేసే పని ఉందని చెప్పి, అనంతపురం నగరంలోని కల్యాణదుర్గం రోడ్డులోని భాగ్యనగర్‌కు పిలిపించుకున్నారు. భాస్కర్‌రెడ్డి వచ్చి జయలక్ష్మితో ఈ విషయమై మాట్లాడుతుండగా దబ్బర రాజేష్ అనే వ్యక్తి వచ్చి తన భార్యతో ఏమి

వివరాలు2లో..

## రాజకీయ విలువల క్షీణత!

**ఖర్గే చేసిన 'మోదీ టెర్రరిస్ట్' వ్యాఖ్యలపై దుమారం**

**నేడు విలువల పతనానికి వేదికగా భారత్**




న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 23 (విజయక్రాంతి): దక్షిణాదిలో ఇటీవల ముగిసిన తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాజకీయాల్లో ఉండే గౌరవమర్యాదల పలుచని పొర మరోసారి చినిగిపోయింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెన్నై వేదికగా ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆ సభా వేదికను దాటి దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే, చివరి రోజు మల్లిఖార్జున ఖర్గే ప్రచారంలో పాల్గొన్నారుఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష అన్నాడీఎంకే కూటమిపై విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో ఖర్గే మాటతూలారు. ఎన్డీయేతో ఎలా చేతులు కలుపుతారని అన్నాడీఎంకేను ప్రశ్నించే క్రమంలో 'మోదీ ఒక ఉగ్రవాది' అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో దేశవ్యాప్తంగా ఆయన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింఅప్పటికే ఎన్నికల కారణంగా దేశంలో రాజకీయ వేడి రాజుకోగా, ఈ వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోసినట్టయింది. వెంటనే ఖర్గే వ్యాఖ్యల పట్ల బీజేపీ శ్రేణుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. విమర్శలు వెల్లువెత్తాయి. బీజేపీ సీనియర్ నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సహా పలువురు ఖర్గే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది ప్రధాని మోదీని మాత్రమే అవమానించినట్టు కాదని, దేశ గౌరవానికి భంగం కలిగించే విషయమని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఖర్గే తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరిచి విపక్ష నేతలను బెదిరింపులకు గురిచేయడం, అధిక పన్నులు విధించడం (ట్యాక్స్ టెర్రిరిజం) గురించి మాత్రమే తాను మాట్లాడానని, తనకు ఎలాంటి దురుద్దేశం లేదని ఆయన చెప్పారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆయన వ్యాఖ్యలు దేశమంతటా పాకిపోయాయి. చర్చలు, వివాదాలకు కేంద్రబిందువుగా మారిపోయాయి. మన దేశ రాజకీయ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇది భారత రాజకీయాల్లో పెరుగుతున్న విపరీత ధోరణికి నిదర్శనమని చెప్పవచ్చు. గతంలో మన దేశంలో ప్రభుత్వాల విధానాలపై చర్చలు, వాదనలు జరిగేవి. విధానాలపైనే విమర్శలు చేసేవారు. కానీ, ఇప్పుడు వ్యక్తిగత విమర్శలు, దూషణలు నానాటికీ పెరిగిపోతుండటం ఆందోళనకరంకాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కొత్త కాదు. ఈ తరహా వ్యాఖ్యల మూలంగా కాంగ్రెస్ పార్టీ గతంలో మూల్యం కూడా చెల్లించుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ గతంలో ప్రధాని మోదీని 'నీచమైన మనిషి' అని

వివరాలు2లో..

## ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

**-నిర్బంధించినంత కాలం తెరిచేది లేదు : ఇరాన్**

**-- యుద్ధంతో పతనం దిశగా ఆర్థిక వ్యవస్థ**




వాషింగ్టన్ : అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకా దళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు. 'హర్మ్యాజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా

వివరాలు2లో..

## రికార్డు స్థాయిలో పోలింగ్

**పశ్చిమబెంగాల్‌లో 91.78 శాతం, తమిళనాడులో 84.69 శాతం**

**బెంగాల్‌లో తొలివిడత 152, తమిళనాడులో ఒకే**

**ప్రజాస్వామ్యంలో 'సూపర్ థ్రస్ డే' సీఈసీ జ్ఞానేష్ కుమార్**



కోల్‌కతా/చెన్నై, ఏప్రిల్ 23: పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో గురువారం భారీగా ఓటింగ్ జరిగింది. బెంగాల్లో మొదటి దశ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకుగాను 152 స్థానాలలో ఓటింగ్ జరగ్గా 91.78శాతం పోలింగ్ నమోదైంది. ఏప్రిల్

వివరాలు2లో..

## కారు జోరు!

**ప్రభుత్వంపై అసంతృప్తిని అజెండా చేసుకున్న బీఆర్ఎస్**

**పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా వ్యూహం**

**అన్ని వర్గాల్లోని విముఖతను అనుకూలంగా మార్చుకునే యోచన**

**కేసీఆర్ జగిత్యాల సభతో పార్టీలో పెరిగిన జోష్**



హైదరాబాద్, : రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను సమీక్షించిన బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తినే ప్రధాన అజెండాగా మలుచుకుని ముం దుకు సాగుతున్నది. వివిధ వర్గాల్లో కనిపిస్తున్న విముఖతను గమనించి, దాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వ్యూహారచన

వివరాలు2లో..

## నేడు 62 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

మొదటి పేజీ తరువాయి

89 మండలాల్లో సాధారణ వడగాడ్పులు వీచే అవకాశం ఉందని ఒక ప్రకటనలోపేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కువ మండలాలు తీవ్ర వడగాల్పుల ప్రభావంలో ఉండనున్నాయి. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని మండలాల్లో కూడా తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. గురువారం రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎండలో బయటకు వెళ్లకూడదని సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు తలపై టోపీ లేక వస్త్రాన్ని ధరించడం, కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ వాడడం మంచిదన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. అలాగే శరీరంలో నీటి లోపం రాకుండా నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

## అనంతలో హనీ ట్రాప్ కలకలం

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నావంటూ బెదిరించి ఇద్దరి బట్టలు విప్పించి న్యూడ్‌గా ఫొటోలు తీశారు. అంతలోనే రంగమ్మ అలియాస్ చిన్ని వచ్చి పెద్ద మనిషిగా వ్యవహరిస్తూ ఈ విషయం బయటకు చెబితే పరువుపోతుందని, నాలుగు లక్షల రూపాయలు ఇస్తే వదిలేస్తామని బెదిరించారు. దీంతో, ఆ మొత్తాన్ని రాజేష్ ఇచ్చి అక్కడి బయటపడ్డారు. అనంతరం దీనిపై పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. ఎనిమిది మంది భాగస్వామ్యులైనట్టు గుర్తించారు. వారిలో ఐదుగురిని అరెస్టు చేశారు. మొత్తం వ్యవహారంలో ఆజాద్ నగర్‌లో ఉంటున్న రంగమ్మ అలియాస్ చిన్ని కీలకంగా వ్యవహరించారు. ఆమెపై 2020లో తిరుపతిలో ఇదే రకమైన కేసు నమోదైంది. చిన్నితోపాటు అరవింద్‌నగర్ రెండవ క్రాస్‌లో ఉంటున్న దబ్బర రాజేష్, భాగ్యనగర్‌లో ఉంటున్న మంగళి జయలక్ష్మి, రుద్రంపేట బైపాస్‌లో ఉంటున్న చంద్రకళ, రామచంద్రనగర్ చర్చి స్కూల్ వద్ద ఉంటున్న అనంతకుమారిలను పోలీసులు అరెస్టు చేశారు.

## అమెరికా వీడుదామంటున్న భారతీయులు!

న్యూయార్క్, ఏప్రిల్ 23 (విజయక్రాంతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనలో భారతీయులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నా రు. 'కార్నెగీ ఎండోమెంట్' అనే సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో 40 శాతం మంది భారతీయులు శాశ్వతంగా అమెరికాను వీడాలని ఆలోచిస్తున్నట్లు స్పష్టమైంది. ప్రతీ వందమందిలో 40 శాతం మంది భారతీయ అమెరికన్లు రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నందువల్ల తిరిగి భారత్‌కు వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు సర్వేలో తేలింది. అక్కడి జీవన విధానాలు, ట్రంప్ జీవన వ్యయంపై 54, వ్యక్తిగత భద్రతపై 41 శాతం మంది తమ ఆందోళనలను వ్యక్తపరిచారు. ట్రంప్ పరిపాలనపై 71 శాతం మంది ఇండియన్ తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. అమెరికాను వీడేందుకు ఆర్థిక ఒత్తిళ్లు కూడా మరో ప్రధాన అంశంగా సర్వేలో వెల్లడైంది. పెంపకం ఖర్చు, ఇంటి ఆలోచించేందుకు మరో కారణంగా నిలిచింది. అగ్రరాజ్యంలో 2024 లెక్కల ప్రకారం 54 లక్షల మందికిపైగా భారతీయులు నివసిస్తున్నారు.

## రాజకీయ విలువల క్షీణత!

మొదటి పేజీ తరువాయి

సంబోధించడాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కూడా అదే తరహా విమర్శలు వస్తున్నాయిరాజకీయాల్లో అధికార, విపక్ష నేతలు పరస్పరం ఒకరినొకరు గౌరవించుకోవడంలో గతంలో భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచేది. జవహర్‌లాల్ నెహ్రూ, అటల్ బిహారి వాజపేయ్ మధ్య ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. వీరి మధ్య విధానాపరమైన విషయాల్లో విభేదాలు ఉన్నప్పటికీ, వ్యక్తిగతంగా మాత్రం ఒకరినొకరు ఎంతో గౌరవించుకునేవారు. వాజపేయ్ విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడు తన కార్యాలయంలో నెహ్రూ చిత్రపటాన్ని తిరిగి పెట్టాలని ఆయన ఆదేశించడం నాటి సంస్కృతికి నిదర్శనం. అలాగే పీవీ నరసింహారావు 1994లో జెనీవాలో జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశానికి వాజపేయ్‌ని భారత ప్రతినిధిగా పంపడం నాటి రాజకీయ నేతల మధ్య ఉన్న విశ్వాసం, గౌరవమర్యాదలను ప్రతిబింబిస్తోంది1950 మధ్యకాలంలో మన దేశంలో ముఖ్యంగా ప్రభుత్వాల విధానాలపై మాత్రమే చర్చలు జరిగేవి. 1990లలో కూటమి రాజకీయాలు సంయమనాన్ని నేర్పించాయి. అయితే 2014 తర్వాత రాజకీయ భాష మరింత కఠినంగా మారింది. విధానపరమైన విమర్శలకు బదులుగా వ్యక్తిగత విమర్శలు ఎక్కువయ్యాయి. గతంలో మౌత్ కా సౌదాగర్, చౌకీదార్ చోర్ హై, ఇప్పుడు టెర్రరిస్ట్ వంటి పదజాలం వినిపించడం సర్వసాధారణమైపోయిందిఇలాంటి తీవ్ర పదజాలం రాజకీయ నేతల నుంచి వినిపిస్తే, అది సమాజంలో విభజనను పెంచుతుంది. సోషల్ మీడియా వేదికలు ఆగ్రహాన్ని మరింత పెంచే ప్రమాదముంది. మన దేశంలో ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్య పోటీగా కాకుండా, రాజకీయ ప్రత్యర్థులను వ్యక్తిగతంగా ఓడించే యుద్ధక్షేత్రాలుగా మారుతున్నాయి. ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమో, లేదా పొరపాటో కాదు. ఇది భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పెరుగుతున్న రాజకీయ గౌరవమర్యాదల సంక్షోభానికి సూచిక. గెలుపోటములు శాశ్వతం కాదు, రేపటి రోజున అధికారంలోకి మరొకరు రావచ్చు, మరో పార్టీ అధికార పీఠమెక్కవచ్చు. కానీ, ప్రజాస్వామ్య విలువలు, రాజకీయ నేతలు ఇచ్చిపుచ్చుకునే గౌరవం మాత్రమే శాశ్వతం. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. భారత రాజకీయాలు మళ్లీ తన పూర్వపు విలువల్ని సంతరించుకోవాలంటే, నాయకులు పాత తరం నాయకుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. గౌరవంతో కూడిన వాదోపవాదాలే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతాయి.

## ప్రతి ఇంటికి సోలార్

మొదటి పేజీ తరువాయి

యూనిట్, రూ.1200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2100 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."అనకాపల్లి జిల్లా భారీ పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోంది. పెట్టుబడుల్లో ఈ జిల్లా భారత్‌లోనే అగ్రస్థానానికి చేరుతుంది. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ సంస్థ 6.5 గిగావాట్ల ఇన్ గాట్ సోలార్ వేఫర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా వెనుకబడిన ప్రాంతం. కానీ ఇప్పుడు ఆ జిల్లానే అత్యంత సంపద కలిగిన ప్రాంతంగా మారింది. విశాఖ సమీపంలోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. కేంద్ర మాజీమంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు సుమంత్ సిన్హా ఈ సోలార్ వేఫర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాన్ని ఎంచుకుని వ్యాపారం మొదలు పెట్టారు... ఇప్పుడు పెట్టుబడులు పెట్టడానికి ఏపీని ఎంచుకున్నారు. రెన్యూ ఎనర్జీ కేంద్ర కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరుతున్నాను. రెన్యూ ఎనర్జీనే కాదు... జాతీయ అంతర్జాతీయ సంస్థలను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెడితే సురక్షితంగా ఉంటాయి. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నా. గడచిన 22 నెలల్లో 802 ఎంఓయూలు చేసుకున్నాం... వాటిపై నిరంతరం సంప్రదింపులు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అనుమతులు ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం. 2019-24 మధ్య పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు భయపడ్డారు. వేధింపులు, అవినీతి పెద్ద ఎత్తున జరిగింది. 2024లో మీరు వేసిన ఒక్క ఓటుతో ప్రజల్లో అభద్రత, ఆందోళనను తొలగించాం. ఎన్డీఏ బ్రాండ్‌తో ఏపీలో విశ్వాసం తిరిగి వచ్చింది. పరిశ్రమలకు, పెట్టుబడులకు భరోసా వచ్చింది. పారిశ్రామిక వేత్తలకు సహకరిస్తూ భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉత్తరాంధ్రలో ప్రతి రోజూ పెట్టుబడుల పండుగ. ఈ నెల 28 తేదీన 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. జూలైలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోంది. లారస్ ల్యాబ్ రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోంది. ప్రధాని మోదీ సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. రైల్వే జోన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. విశాఖ-రాజమహేంద్రవరం మధ్య కార్గో కోసం నాలుగు రైల్వేలైన్ల స్పీడ్ రైల్ కారిడార్ వస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాల నుంచే ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే పరిస్థితి తెస్తాం. ఈ రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌తో నన్ను విశ్వసించిన యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి."అని ముఖ్యమంత్రి చెప్పారు.రెన్యూవబుల్ ఎనర్జీతో జాతి నిర్మాణం"అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఓ భాగం. ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్టే. అందుకే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. గత పాలకులు విధ్వంసం చేసిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మాణం చేయాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రజా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెన్యూ ఎనర్జీ వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రాంబిల్లిలో సౌర ఫలకాలు తయారవుతాయి. విద్యుత్ సంస్కరణల్ని ప్రారంభించింది మేమే. ఆ ఫలితాలు అందరికీ అందుతున్నాయి. ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 90 గిగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి చేసేలా పనులు గ్రౌండ్ అయ్యాయి. రూ.5.95 లక్షల కోట్లు ఈ రంగంలో పెట్టుబడులు వచ్చాయి., ఎంఓయూలు సిద్ధమైపోయాయి. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోంది. గ్రీన్ ఈవీ వాహనాలు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాం. ఆర్టీసీ కూడా 1,050 బస్సులు తీసుకువస్తోంది. భవిష్యత్తులో ఆర్టీసీ బస్సులన్నీ ఈవీ బస్సులే. పేదలకు కూడా ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రంలో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతీ ఇంటిపైనా విద్యుత్ ఉత్పత్తి కోసం పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలి. 40 లక్షల ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అటు రైతులు కూడా పీఎం కుసుమ్ కింద సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్ అక్కడే వాడుకునే పరిస్థితి ఉంటే ట్రాన్స్ మిషన్ నష్టాలు కూడా ఉండవు. రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి అంటే... జాతి నిర్మాణమే. అలాంటి మంచి కార్యక్రమానికి సహకరిస్తున్న రెన్యూ సంస్థను అభినందిస్తున్నాను. ప్రస్తుతం యుద్ధం జరుగుతోంటే... గ్యాస్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దేశీయంగానే విద్యుత్ ఉత్పత్తి సహా ఇతర అంశాల్లో మనం ముందంజలో ఉంటే... అంతర్జాతీయంగా వచ్చే ఇబ్బందులను తట్టుకునే పరిస్థితి ఉంటుంది. అందుకే ప్రధాని మోదీ రెన్యూవబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారు."అని సీఎం చంద్రబాబు చెప్పారు.గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తున్నాం..."పేదల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజలకు సుపరిపాలన అందేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ రంగం సహా వివిధ వ్యవస్థల్లో గత ప్రభుత్వ తప్పిదాలు సరి చేస్తున్నాం. 2019-24లో పీపీఏలు రద్దు చేసి, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేశారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనం కట్టాల్సి వచ్చింది. ప్రజలపై రూ. 32 వేల కోట్ల భారాన్ని గత పాలకులు వేశారు. ట్రూ ఆప్ ఛార్జీలు పేరుతో భారీగా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారు. గత పాలకులు వేసిన ట్రూ ఆప్ ఛార్జీలను... మేం చరిత్రలో తొలిసారిగా ట్రూ డౌన్ అమలు చేశాం. దీంతో పాటు ట్రూ అప్ భారాన్ని కూడా ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరిస్తోంది. రూ.15,795 కోట్లు ఛార్జీల భారం పెంచకుండా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే నిలబెట్టుకుంటున్నాం. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాం... విద్యుత్ ఛార్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచం. గత పాలకులు ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చారు. వాటిని రీషెడ్యూలు చేస్తున్నాం. అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నాం. రాజధాని అమరావతి నిర్మాణంతో రాష్ట్ర దశాదిశ మారుతుంది. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ సహా 9 జిల్లాలు, అమరావతి కేంద్రంగా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ, తిరుపతి కేంద్రంగా రాయలసీమ అంతటా వివిధ రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రతో హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధించడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం"అని ముఖ్యమంత్రి వెల్లడించారుహత్యలు చేస్తారు... సాక్షుల్ని బెదిరిస్తారు..."మంచి కార్యక్రమాలు... శుభ దినాల్లో కూడా తప్పుడు పనులు చేసే వారిని... దుర్మార్గులను గుర్తు చేసుకోవాలి. అలాంటి వారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి కాబట్టి... చెప్పాల్సి వస్తోంది. నేరాలు ఘోరాలు చేసే ఓ పార్టీ రాష్ట్రంలో అరాచకాలు చేస్తోంది. వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు. జగన్ మోహన్ రెడ్డి మేనమామకు ప్రధాన అనుచరుడు ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపేశారు. డబ్బు కోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది. ఇలాంటి మోసగాళ్లపై నిరంతరం కన్నేసే ఉంచుతున్నాం. ప్రస్తుతం నేరస్థులతో రాజకీయం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా చేశారు.

## కారు జోరు!

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నది. పాలనలో కనిపిస్తు న్న లోపాలు, హామీల అమలులో జాప్యం, రైతులు, ఉద్యోగులు, మహిళలు, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రధాన అంశాలుగా మార్చుకుని ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టాలని యోచిస్తున్నది గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు ఈ అంశాలను చర్చకు తీసుకువచ్చి, ప్ర భుత్వంపై పోరాటాన్ని బలోపేతం చేయడంపై దృష్టిపెట్టింది. ఇటీవల జగిత్యాల లో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడం తో కేడర్‌లో ఉత్సాహం పెరిగింది. దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంపై బీఆర్‌ఎస్ దృష్టిపెట్టింది. ఈ నేపథ్యంలో నేత్వరలో అన్ని జిల్లాల్లో వరుసగా సభలు నిర్వహి స్తూ ప్రభుత్వంపై నేరుగా రాజకీయదాడి చేసేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమ వుతోందిప్రభుత్వంపై పెరుగుతున్న వ్య తిరేకతను కొనసాగించేందుకు బీఆర్‌ఎస్ మరింత దూకుడుగా వ్యవహరించే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల సమస్యలను నేరుగా హైలైట్ చేస్తూ, గత పాల నతో పోలికలు చూపించడం ద్వారా తన బలాన్ని పెంచుకోవాలని చూస్తోందిఅంతేకాకుండా అన్ని వర్గాల్లోని అసంతృప్తిని ఒకే రాజకీయ దిశగా మళ్లించడం ద్వారా ఓటు బ్యాంకును బీఆర్‌ఎస్ వైపు తిప్పుకునే లక్ష్యం తో వ్యూహాలు రూపొందిస్తోంది. క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేస్తూ, ప్రజల్లోకి బలమైన సందేశం తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధంచేస్తోందిఅసంతృప్తినిపై వ్యూహం.గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు స్థానిక సమస్యలతో పాటు రాష్ట్రస్థాయి పాలన వైఫల్యాలను ప్రజలకు వివరించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు సమాచారం. రైతు సమస్యలు, ఉద్యో గుల అసంతృప్తి, సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం వంటి అంశాలను ప్రధానం గా ఎత్తిచూపేలా పార్టీ దృష్టిపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒక్కోవర్గంలో ఒక్కో కార ణంతో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుంఈ పరిస్థితులను వచ్చే ఎన్నికల సమయానికల్లా తమకు అనుకూలంగా మలుచు కోవాలని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాచరణ రూ పొందిస్తున్నది.

రైతులకు ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగులకు పెండింగ్ సమస్యలు, మహిళలకు సంక్షేమ పథకాల అమలులో జాప్యం, యువతలో ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి వంటి అంశాలను ప్రధానంగా ఎత్తిచూపాలని యోచిస్తున్నది. గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలు, అభివృద్ధి పనులను ఉదాహరణలుగా చూపిస్తూ మళ్లీ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకోవాలని చూస్తోందిఅన్ని జిల్లాల్లో కేసీఆర్ సభలు...ఇటీవల జగిత్యాలలో నిర్వహించిన కేసీఆర్ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ పార్టీలో కొత్త ఉత్సాహం వచ్చింది. భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కనిపించిన చైతన్యం పార్టీలో ఆత్మవిశ్వాసాన్ని అందించినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సభలో కేసీఆర్ ప్రసంగం పార్టీ కేడర్‌ను మళ్లీ యాక్టివ్ చేయడంలో కీలకపాత్ర పోషించిందని భావిస్తు న్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై చేసిన విమర్శలు, గత పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రస్తావన పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచాయిఈ సభ సక్సెస్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భారీ సభలను నిర్వ హించాలనే దిశగా బీఆర్‌ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. త్వరలోనే అన్ని జిల్లాల్లో వరుసగా కేసీఆర్ సభలు నిర్వహించాలనే దిశగా పార్టీ నాయకత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలుస్తోం ది. ప్రతి జిల్లాలో స్థానిక సమస్యలను కేం ద్రంగా తీసుకుని, ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ప్రజల్లో బలంగా ప్రతిబింబించేలా ఈ సభలను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.బూత్‌స్థాయి నుం చి జిల్లాస్థాయి వరకు సమన్వయం చేస్తూ ప్రతి సభను విజయవంతం చేయాలనే దిశ గా ప్రత్యేక టీంలను నియమించే యోచనలో ఉంది. ఈ సభల ద్వారా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనను పోల్చడంతోపాటు ఆయా పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను హైలైట్ చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ వరుస సభలతో బీఆర్‌ఎస్ రాష్ట్ర రాజకీయాల్లో మళ్లీ తన ఉనికిని బలంగా చాటుకో వాలని చూస్తోం ది. కేడర్లో వచ్చిన ఉత్సాహాన్ని కొనసాగిస్తూ, ప్రజల్లో బలమైన రాజకీయ సందేశం వెళ్లేలా పార్టీ

## భారత్, చైనాలు 'నరక కూపాలు'

మొదటి పేజీ తరువాయి

జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' మీడియాలో రీపోస్ట్ చేశారు. దీంతో ఆయనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే భారత్, చైనా దేశాలు నాగరికతలకు పుట్టినిల్లు అని ట్రంప్‌నకు హైదరా బాద్‌లోని ఇరాన్ ఎంబసీ కౌంటర్ ఇచ్చిందిఇరాన్ నాగరికతను నాశనం చేస్తానన్న ట్రంప్ దేశమే అసలైన నరకమని పేర్కొంది. అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ రాసిన ఈ పోస్టులో అమెరికాలో పుట్టుకతో పౌరసత్వం కల్పించే చట్టంపై ట్రంప్ తీవ్ర వ్యతిరేకత వ్యక్తపరిచారు. భారత్, చైనా వంటి దేశాల నుంచి ప్రజలు గర్భంతో ఉన్న తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా ఆ పిల్లలు తక్షణమే అమెరికా పౌరులుగా మారుతున్నారని ఆయన ఆరోపించా రు. 'ఇక్కడ పుట్టిన బిడ్డ తక్షణమే పౌరుడు అవుతాడుఆ తర్వాత వాళ్లు చైనా, భారత్ లేదా భూమిపై ఉన్న మరో నరకకూపం నుంచి తమ పూర్తి కుటుంబాన్ని ఇక్కడికి తీసుకొస్తారు' అని సావేజ్ తన లేఖలో రాశారు. అంతటితో ఆగకుండా భారత్, చైనా వలసదారులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు' అని అభివర్ణించారు. ట్రంప్ ఈ లేఖను పోస్ట్ చేయడానికి ఒక రోజు ముందు, అమెరికా మినహా ప్రపంచంలో ఏ దేశంలోనూ పుట్టుకతో పౌరసత్వం ఇచ్చే విధానం లేదని ఓ ఇంటర్వ్యూలో తప్పుడు ప్రకటన చేశారు.అయితే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కౌంటర్ ఇచ్చిం ది. భారత్, చైనాలు నాగరికతలకు పుట్టినిల్లు అని పేర్కొంది. వాస్తవానికి, ఇరాన్ నాగరికతను నాశనం చేస్తానని ఏ యుద్ధ నేరస్థుడైన అధ్యక్షుడు ((ట్రంప్) బెదిరింపులకు పాల్పడుతున్నాడో అక్కడే (అమెరికా) నరకం ఉందని ఇరాన్ కాన్సులేట్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసింది. ట్రంప్‌ను ఉద్దేశిస్తూ హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ వరుస ట్వీట్లు చేసింది. విభజించి, పాలించు అనే సూత్రం ఉందని, కానీ ట్రంప్ మాత్రం ఎలాంటి పద్ధతి లేకుండా విభజిస్తున్నారని ఆరోపిస్తూ మరో పోస్టు చేసింది. ట్రంప్ నిత్యం ఏదో ఒక పోస్టుతో తనలోని అంతులేని అమానవీయతను రుజువు చేస్తున్నారని, ఇది అసలైన జాత్యాహంకారం అని ఇంకో పోస్టు ద్వారా విమర్శించింది.

## ఇరాన్ నౌకలను ధ్వంసం చేసెయ్యండి

మొదటి పేజీ తరువాయి

సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తు న్నాను" అని పేర్కొన్నారు. అంతేకాకుండా హార్మూజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతి తోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తెల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోందన్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్బంధం కొనసాగుతుందని తెలిపారుఅయితే కొద్ది రోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాని ట్రంప్ నుండే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్బంధం కొనసాగుతు న్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్మూజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్మూజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత పతనం అవుతుందని ఎస్‌పి గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ గురువారం నివేదించింది. ఉత్పత్తి వ్యయాలు భారీగా పెరిగిపోతున్నాయని, సేవా రంగంలో కూడా కార్యకలాపాలు మందగించాయని ఈ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం అధిక భాగం తట్టుకున్నప్పటికీ, దాదాపు రెండు నెలలనుండి కొనసాగుతున్న యుద్ధంతో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, ఆహార సరఫరాలపై ప్రభావం, ఆర్థిక వృద్ధి మందగించడానికి కారణాలు నివేదిక విశ్లేషించింది. యూరో జోన్‌లోని 21 దేశాలు అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న వాటిలో ఉన్నాయని, దీనికి సంబంధించిన అబివృద్ధి సూచిక మార్చిలో 50.7 శాతం నుండి ఏప్రిల్‌లో 48.6 శాతానికి పడిపోయిందని తెలిపింది.

## రికార్డు స్థాయిలో పోలింగ్

మొదటి పేజీ తరువాయి

29న 142 స్థానాలకు గాను రెండో విడతలో పోలింగ్ జరగనుంది.తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు రికార్డు స్థాయిలో 84.69 శాతం పోలింగ్ నమోదైంది. రెండు రాష్ట్రాల చరిత్రలో 1952లో ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి నమోదైన అత్యధిక ఓటింగ్ శాతం ఇదే కావడం గమనార్హం. బెంగాల్ తొలివిడతలో 16 జిల్లాల్లోని 152 స్థానాలకు గాను 1,452మంది అభ్యర్థులు పోటీపడ్డారు. కాగా ఇరు రాష్ట్రాల్లో అధికారం తమదంటే తమదేనంటూ ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మే 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు..పశ్చిమ బెంగాల్ ఓటింగ్ సందర్భంగా పలుచోట్ల హింసాత్మక ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దక్షిణ మిడ్నాపూర్‌లోని కుమార్‌గంజ్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సువెందు అధికారిని కొందరు వెంబడించి దాడిచేశారు. దాడిచేసిన వారిలో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. మరికొంతమంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో అసన్సోల్ సౌత్ బీజేపీ అభ్యర్థి అగ్నిమిత్ర పాల్ కారుపై దాడి రాళ్ల జరిగింది. టీఎంసీ దుండగుల దుశ్చర్యగా అగ్నిమిత్ర అభివర్ణించారు. బీర్‌భూమిలోని బోధ్పూర్ గ్రామంలో ఒక ఈవీఎం పనిచేయకపోవడంతో, ప్రజలు పోలీసులు, కేంద్ర బలగాలపై కొందరు దుండగులు రాళ్లు రువ్వారు. ఒక పోలీసు వాహనాన్ని ధ్వంసం చేశారు.

# అన్ని శాఖలు 'ఏం' గ్రేడ్‌లో నిలవాలి

## శతశాతం లక్ష్యాలను సాధించాలి- జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

ప్రజాస్వామ్యం / విజయనగరం : ప్రభుత్వ ప్రాధాన్యత సూచిక (కీ ఫెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్) అమలులో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో



నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల పనితీరును సమీక్షించిన కలెక్టర్, నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని శాఖలు తప్పనిసరిగా 'ఏం' గ్రేడ్ సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావడంలో కెపిఐ కీలకమని, ఆయా సూచీల్లో వెనుకబడిన శాఖలు తక్షణమే పురోగతి సాధించాలని సూచించారు.అంతకుముందు ప్రణాళికాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పియూష్ కుమార్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పియూష్ కుమార్ మాట్లాడుతూ, 2026-27 సంవత్సరానికి సంబంధించి 396 ఇండికేటర్స్‌లో అత్యుత్తమ గ్రేడ్‌లను సాధించేదుకు ఆయా శాఖల రాష్ట్ర



ఉన్నతాధికారులు కృషి చేయాలని కోరారు. అలాగే మండలాలకు నిర్ధేశించిన 199 ఇండికేటర్స్‌లో మెరుగైన పనితీరును ప్రదర్శించాలన్నారు. 29వ తేదీనాటికి అన్ని నివేదికలను సమగ్రంగా అందజేయాలని చెప్పారు. జిఎస్‌డిపి లక్ష్యాలను వివరించారు. 1,2,3వ సవరించిన అంచనాలకు అనుగుణంగా మండలాల వారీగా కూడా ఎండిపిల అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ పి.బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జడ్.పి.హెచ్.ఎస్‌లో

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



ప్రజాస్వామ్యం / గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినిలు, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు , నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తవుడు ,మాజీ ఎంపీటీసీ కరుమజ్జి కృష్ణ, ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ ,ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘము సాలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పెంట తిరుపతిరావు



ప్రజాస్వామ్యం /సాలూరు జాతీయ బీసీ సంక్షేమ సంఘము సాలూరు నియోజకవర్గ అధ్యక్షులుగా మక్కువ మండలంలోని ఏ. వెంకంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెంట తిరుపతిరావు ఎన్నికయ్యారు. హైదరాబాద్ బీసీ సంక్షేమ భవన్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య సమక్షంలో సంబంధిత ఎన్నిక ధ్రువపత్రాన్ని పెంట. తిరుపతిరావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పెంట తిరుపతిరావు మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలోని బీసీల సంక్షేమమే ధ్యేయంగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, బీసీ సంఘ అభివృద్ధి కొరకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరరావు, మహిళ అధ్యక్షురాలు వై. నూకాలమ్మ, పార్వతీ పురం మన్యం జిల్లా అధ్యక్షులు రేవళ్ల. తిరుపతిరావు, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి పి ల్ల. కన్నం నాయుడు పాల్గొన్నారు.

### మన్యం జిల్లా ప్రజలకు హెచ్చరిక:

## రాబోయే 5 రోజులు భానుడి భగభగలు

ప్రజాస్వామ్యంపార్వతీపురం, : జిల్లా ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని రియల్ టైమ్ గవర్నెన్స్ (ఞ+) విభాగం హెచ్చరికలు జారీ చేసింది. తాజా వాతావరణ అంచనాల ప్రకారం, రాబోయే ఐదు రోజుల పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉంది. జిల్లాలోని 15 మండలాల్లో హీట్ ఇండెక్స్ 41ಲీజ నుండి 54ಲీజ వరకు నమోదయ్యే అవకాశం ఉంది. దీనిని వాతావరణ శాఖ 'ప్రమాదకర స్థాయిగా గుర్తించింది.కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని, కొమరాడ, వీరఘట్టం, బలిజిపేట, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి మరియు పాలకొండ మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండనుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, రాబోయే ఐదు రోజుల్లో జిల్లాలో వర్షం కురిసే అవకాశాలు లేవని, వాతావరణం పొడిగా ఉంటుంఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు మధ్యాహ్నం సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, తగినన్ని నీళ్లు తాగుతూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవం




తగరపువలస, ప్రజాస్వామ్యం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తగరపువలస నందు "అంతర్జాతీయ ఆంగ్ల భాషా దినోత్సవం" నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. పి.శ్రీవాణి మాట్లాడుతూ ఆంగ్లభాష ప్రాముఖ్యతను వివరిస్తూ అందరికీ అర్థమయ్యేలా మరియు ప్రపంచ దేశాలతో అనుసంధాన పరచడానికి ఒక మధ్యేమార్గంగా ఉందని, ప్రస్తుతం ఉన్న యువత ఇంగ్లీష్ బాష పై పట్టు సాధించి మరీయు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఇంగ్లీష్ లెక్చరర్ సి.హెచ్. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష యొక్క ఆవిర్భావం గురించి విపులంగా వివరిస్తూ ప్రస్తుతం ఉన్నటువంటి కాలంలోనే ఇంగ్లీష్ యొక్క ప్రాముఖ్యతను క్లుప్తంగా వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఇంగ్లీష్ భాష యొక్క విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

## లక్ష్యం ఉంటే ఏదైనా సాధ్యమే-జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత

ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 23: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత అధ్యక్షత వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారుతొలుత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి డి ఆర్ ఓ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం ఉంటే ఏదైనా సాధ్యమేనని, విద్యార్థులు తమ జీవితంలో ఎంతటి కష్టమైన పనినైనా పట్టుదలతో సాధించాలని, అసాధారణ పట్టుదలతో గంగను భూమికి రప్పించిన భగీరథుని కృషి చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసిన భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల నేటి యువతకు మరియు రాబోయే తరాలకు గొప్ప ఆదర్శంసమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. భగీరథుని 'భగీరథ



ప్రయత్నం' అనే పదం పట్టుదలకు మారుపేరుగా మారిందని, అదే స్ఫూర్తితో ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఈ సందర్భంగా నీటి సంరక్షణ ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరూ నీటి వనరులను కాపాడాలని పిలుపునిచ్చారుకార్యక్రమంలో బి.సి వెల్ఫేర్ అధికారి అప్పన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి కె. బాల మాన్ సింగ్, కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, నాగవంశం డైరెక్టర్ హనుమంతు శంకర రావు, డైరెక్టర్ ఉరిటి యాదవ్ తదితరులు ఉన్నారు.

### రాబోయే ఖరీఫ్ సీజన్ కార్యాచరణ

## ప్రణాళిక, రైతులతో సమావేశం అయినా ఏ ఓ అనురాధ

ప్రజాస్వామ్యం/ పాచిపెంట ఏప్రిల్ 24: ఈరోజు పాచిపెంట మండలంలో కర్రివలస రైతు సేవా కేంద్ర పరిధిలో బొబ్బిలి వలస గ్రామంలో రాబోయే ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మార్ట్ (మన్యం అగ్రికల్చర్ రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ )మరియు ధాత్రి మాత బచావో నిర్గాని సమితి(నేలతల్లి సంరక్షణ కమిటీ) సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ పండ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్లో ప్రతి ఒక్కరు రసాయన ఎరువులను తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు అందించాలని కోరారు. రాబోవు రోజుల్లో యూరియా లభ్యత తక్కువగా ఉండటం వల్ల మండలంలో ప్రతి ఒక్క రైతు సోదరులు గమనించి రసాయన ఎరువులపై ఆశ పడకుండా ప్రకృతి వ్యవసాయం మారాలని కోరారు. భూమి యొక్క సారం పెంచడానికి పశువుల ఎరువుల ఎక్కువ మోతాదులో వాడాలని సూచించారు. తెగుళ్ల ,పురుగుల సస్య రక్షణకై ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సూచించినటువంటి కషాయాలు మరియు ఘన జీవామృతం ద్రవ జీవామృతం, అజ్ఞాస్త్రం,బ్రహ్మాస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయంతో కూడిన



మందులను వాడాలని సూచించారు. అధికంగా యూరియా వాడటం వల్ల నేల యొక్క ఆరోగ్యం దెబ్బతింటుంది. తద్వారా పంటలు దిగుబడి కూడా తగ్గుతుంది. కనుక ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగు చేయాలని రైతుల ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కర్రివలస గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్ చక్రధర్ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తర్లువాడ రైతులకు అండగా నిలిచిన సిపిఎం నాయకులు

-- బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాస్వామ్యం ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ నేపథ్యంలో రైతులను పరామర్శించేందుకు వెళ్లిన సిపిఎం నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారుఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తర్లువాడ గ్రామంలో పోలీసులు భారీగా మోహరించి, గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని సమాచారంరైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలతో సిపిఎం నాయకులు గ్రామాన్ని సందర్శించగా, పోలీసులు వారిని గ్రామంలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. రైతులతో ఎటువంటి సమావేశం నిర్వహించనీయకుండా సిపిఎం నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని, జీపుల్లో ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారుఅదుపులోకి తీసుకున్న వారిలో 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి తదితరులు ఉన్నారు. సుమారు వందమంది పోలీసులతో సిపిఎం నాయకులను చుట్టుముట్టి, గూగుల్ డేటా సెంటర్ ప్రాంతం వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారుఈ సందర్భంగా గంగారావు, ఆర్.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ, రైతులతో మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. బలవంతపు అరెస్టులు చేయడం తగదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చిమ్మిడివల గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన స్పెషల్ ఆఫీసర్ ఫరూక్


ప్రజాస్వామ్యం/ పాచిపెంట ఏప్రిల్23:ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్పెషల్ ఆఫీసర్ శ్రీ ఫరుక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించిన గరిసిగుడ్డి పంచాయతీ సెక్రెటరీ మన్మదరావు. మన పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు.అలాగే గరిసిగుడ్డి పంచాయతీ సెక్రటరీ శ్రీ మన్మధ గారు మాట్లాడుతూ, ప్రస్తుతం సర్పంచ్ స్థానంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీ ఫరుక్ గారు బాధ్యతలు నిర్వహిస్తున్నందున, గ్రామ ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని కోరారుఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహిస్తూ పాల్గొన్న మాజీ సర్పంచ్‌లు శ్రీ ఎం. ఆనందరావు గారు, శ్రీ ఎం. రామస్వామి గారు, ప్రజలు పాల్గొన్నారు.అలాగే గ్రామ సభలో వీబీజీ రాంజీ పథకం తరపున చేపట్టాల్సిన పనులు, చెరువులు,



చెక్‌డ్యామ్‌లు, ఉపాధి హామీ పనులు గుర్తించి వాటిపై తీర్మానాలు ఆమోదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గరిసిగుడ్డి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీ పి. విజయ్ గారు, సచివాలయం సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థుల నిజాయితీ

### దొరికిన సెల్ ఫోను, డబ్బులు అప్పగింత



ప్రజాస్వామ్యం/ గజపతినగరం:మండలంలోని మర్రివలస ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మరోసారి తమ నిజాయితీని నిరూపించుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకల చంద్రరావు విద్యార్థుల్లో విలువలు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "నేను చేసిన మంచి పని పుస్తకం" మంచి ఫలితాలను ఇస్తుందని ఈ సందర్భంగా చంద్రరావు గురువారం విలేకరులకు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థి దిలీప్ కు రెండు రోజుల క్రితం సాలిపేట మార్గ మధ్యలో ఒక మొబైల్ ఫోన్ దొరికింది. దిలీప్ ఆ ఫోనును ప్రధానోపాధ్యాయులకు అప్పగించాడు. అలాగే గాయత్రి అనే విద్యార్థినికి టి. భూర్జివలస శివాలయం దగ్గర ఒక పర్సుతో 2500 రూపాయలు దొరికాయి. ఈ మొత్తాన్ని కూడా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ దొరికిన సెల్ ఫోను , నగదు సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రరావు తెలిపారు. తాను పాఠశాలలో ప్రారంభించిన నేను చేసిన మంచి పని పుస్తకం మంచి ఫలితాలను ఇవ్వడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా చంద్రరావు తెలిపారు.ఈ మంచి పనిని పాఠశాల పుస్తకంలో నమోదు చేశామన్నారు.

### టిడిపి నుంచి వైకాపాలోకి...


## వైకాపాతీర్థం పుచ్చుకున్న 50 కుటుంబాల యువకులు



ప్రజాస్వామ్యం / గజపతినగరం:టిడిపి నుంచి 50 కుటుంబాల యువకులు గురువారం వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. గురువారం జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో గజపతినగరం మేజర్ పంచాయతీకి చెందిన 50 కుటుంబాల యువకులు మాజీ ఉప సర్పంచ్ కర్రీ రామునా యుడు, రూమ్కాన భాస్కరరావు, వైస్ ఎంపీపీ కర్రీ శ్రీదేవి, కర్రీ నానాజీ, ఆల్తి రామనాయుడు ఆధ్వర్యంలో టిడిపి పార్టీని వీడి వైఎస్ఆర్సిపి లో చేరారు. జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బొత్స అప్పలనరసయ్య వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.

### డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ - బి.రఘు



ప్రజాస్వామ్యం / గజపతినగరం:ఈనెల 24వ తేదీ న గజపతినగరం సబ్ స్టేషన్లో మరమ్మత్తులు , చల్లపేట 11 కె.వి ఫీడర్ మీద చెట్లు కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మండలంలోని గంగచోళ పెంట, పట్రువాడ, కొత్త బగ్గాము, పాత బగ్గాము, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడి పేట , కొనిస, మర్రి వలస, సాలిపేట, చిట్టయ్యవలస , మధు పాడ, మరుపల్లి, తమ్మారాయుడిపేట, గుడివాడ, నారాయణ గజపతిరాజపురం, కొత్త శ్రీరంగరాజపురం,పాత శ్రీరంగరాజపురం, ఎం. వెంకటాపురం, గజపతినగరం, పురిటిపెంట, సీతారాంపురం, పిడిసిల, మద్దూరు, అలాగే మెంటాడ గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు బొబ్బిలి ఆపరేషన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది

### మాజీ మంత్రి - బొత్స సత్యనారాయణ- మాజీ ఎమ్మెల్యే - బొత్స అప్పలనరసయ్య



ప్రజాస్వామ్యం / గజపతినగరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక బెల్లాన కన్వెన్షన్ లో నియోజకవర్గ, గ్రామ కమిటీల విస్తృతస్థాయి సమావేశం మరియు నూతనంగా నియమింపబడ్డ మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కో- ఆర్డినేటర్ బూడి వెంకట్రావుల పదవి స్వీకరణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొత్స సత్యనారాయణ ఒక్క పింఛన్ మొత్తం పెంచడం తప్ప, కూటమి ప్రభుత్వం ఈ రెండు ఏళ్లలో మిగిలిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను సైతం చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఒకేసారి తల్లి ఖాతాలో 13,500 జమ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు విడతలుగా ఆ మొత్తాన్ని జమ చేస్తూ కొందరికి ఎగనామం పెట్టిందన్నారు. ఉపాధి హామీ అంతా డోల్ల చేశారని, వంతుల వారీగా కూలీలకు పని కల్పించడం సిగ్గుచేటు అన్నారు. రైతుల పరిస్థితి మరి అధ్వానంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయడమంటే ఇలాగేనా అని ప్రశ్నించారు. మూడు లక్షల 45 వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం పనిలో తెలుగుదేశం నేతలు నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం బాధాకరమన్నారు. గీతం యూనివర్సిటీకి ఐదువేల కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను దారా దత్తం చేయడం ఈ ప్రభుత్వ దోపిడీకి నిదర్శనం అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ ,జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజక అభివృద్ధిని పక్కనపెట్టి, తన వ్యక్తిగత అభివృద్ధి కోసం అవినీతిలో ముందంజలో ఉన్నారని విమర్శించారు. తండ్రి, కొడుకులు ఇద్దరు అవినీతి కార్యక్రమాలు చేయడంలో ఆరితేరన్నారు. రెండేళ్లు గడుస్తున్న నియోజకవర్గంలో అభివృద్ధి జాడలు మచ్చుకైన కనిపించడం లేదని అన్నారు. పరిశ్రమలు తెచ్చే సత్తా, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే సత్తా మంత్రి కొండపల్లి శ్రీనివాసు లో లేదన్నార మాజీ ఎమ్మెల్యే బొత్స మాట్లాడుతూ, ఈ ప్రభుత్వానికి దోచుకోవడం లో ఉన్న శ్రద్ధ, అభివృద్ధిపై లేదన్నారు. ఈ రెండేళ్లు లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఆ హామీని మరిచారని అన్నారు. అలాగే నియోజకవర్గంలో వైయస్సార్సీపి అనుకూల ఓట్లు తొలగించమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వయంగా రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటు అన్నారు. నియోజకవర్గంలో ప్రజాబలం తమకే ఉందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం నిర్మించిన ఆసుపత్రులను, వేయించిన తారు రోడ్లను మాత్రమే ప్రారంభోత్సవాలు చేశారని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు.అదేవిధంగా గ్రామాలలో సిమెంటు రోడ్లు వేయించడం తప్ప ఇంకా చేసిన అభివృద్ధి ఏమీ లేదని బొత్స ఎద్దేవా చేశారు.వైసీపీ పాలనలో మొక్కజొన్నకు ధర లేకపోతే అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్యమంత్రి జగన్ తో మాట్లాడి మొక్కజొన్నకు మద్దతు ధర ఇప్పించారని బొత్స గుర్తు చేశారుఅలాగే ఇదే సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే సంబంగి వెంకట చిన్నప్పల నాయుడు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో పార్టీ నాయకుల నిర్లక్ష్యము, మితిమీరిన ధీమా కారణంగానే ఓడిపోయమన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లోనైనా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు ఈ ప్రభుత్వంలో కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎరువులు, విత్తనాలు దగ్గర నుంచి రైతు కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం సిగ్గుచేటు అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎక్కడ అన్నారు. అనంతరం నూతనంగా నియమింపబడ్డ మండల పార్టీ అధ్యక్షులుగా పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కోఆర్డినేటర్ గా బూడి వెంకట్రావు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సమావేశంలో విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు సిరిపురపు



జగన్మోహనరావు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మూకల చలం నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పిరుబండి జైహింద్ కుమార్, జడ్పిటిసిలు గార తౌడు, వర్రీ నరసింహమూర్తి, రౌతు రాజేశ్వరి, ఎంపీపీలు బెల్లాన జ్ఞానదీపిక , వైస్ ఎంపీపీ కర్రీ శ్రీదేవి , నాయకులు కర్రీ నానాజీ, కర్రీ రామనాయుడు , ఎంపీపీలు పిరుబండి హైమావతి,గేదెల సింహాద్రి అప్పలనాయుడు, సి. హెచ్. చిన్నమనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమిలి ముత్యాల నాయుడు ,జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి నారాయణ మూర్తి రాజు, నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.



# ఆదర్శవంతమైన గ్రామంగా కురసింగి

### జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి

ప్రజాస్వామ్యం/సీతంపేట, ఏప్రిల్ 23 : పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలంలోని కురసింగి గ్రామం ముస్తాబు చేసుకొని ఒక ఆదర్శవంతమైన గ్రామంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి కొనియాడారు. గ్రామాల రూపురేఖలను మార్చి, వాటిని ప్రతీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'గ్రామ ముస్తాబు' కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని వివరించారు .గురువారం సీతంపేట మండలం కురసంగి గ్రామంలో ఏర్పాటు చేసిన 'గ్రామ ముస్తాబు' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డోలి రహిత జిల్లాగా మన్యంను తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగా మారుమూల గిరిజన గ్రామమైన కురసింగికి బీటీ రోడ్డును నిర్మించుకోవడం గర్వకారణమని అన్నారు. అలాగే విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించి మొదలుపెట్టిన ముస్తాబు, నేడు ఫ్యామిలీ ముస్తాబు, గ్రామ ముస్తాబు కావడంఆనందదాయకమన్నారు. ఈ గ్రామాన్ని ముస్తాబు చేసి అద్భుతమైన, సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన గ్రామస్తులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. గ్రామ ప్రధాన ద్వారం దగ్గర నుంచి గ్రామంలోపల వరకు ఎక్కడా చెత్త కనిపించకుండా చేసారన్నారు. ఇక్కడ స్కూల్ ముస్తాబు చేశారని, వృధాగా ఉన్న స్థలాన్ని పార్కుగా



మార్చారని పేర్కొన్నారు. పిల్లలు ఆడుకునేందుకు, ఆస్వాదించేందుకు ఊయల కూడా ఏర్పాటుచేశారని, రహదారులను పరిశుభ్రంగా ఉంచారని, సమావేశాలకు సామాజిక భవనం కూడా ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక శాసనసభ్యులు ఈ నియోజకవర్గంపై చొరవ చూపుతూ, రహదారుల నిర్మాణాలు చేయిస్తున్నారని గుర్తుచేశారు. ఈ గ్రామాన్ని ఇంత అద్భుతంగా తయారుకావడం మరిన్ని గ్రామాలకు స్ఫూర్తి అయిందని తెలిపారు. సూర్యమండలం పేరుతో విభిన్న కాయగూరల పంటలను వేసుకొని పండించుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాల్గొని కార్యక్రమ విశిష్టతను వివరించారు. గర్భిణీలకు సీమంతాలు చేపట్టారు.పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా, పచ్చదనంతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. ముస్తాబుతో వీధులు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. పాఠశాలలు, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. పాఠశాలలు మరియు వీధుల్లో కనీస సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను పెంచవచ్చని అభిప్రాయపడ్డారు. కురసంగి గ్రామంలో చేపట్టిన ఈ పనులు మిగిలిన గ్రామాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ ఒ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### విజయనగరం రైల్వే స్టేషన్‌లో

# 10 కేజీల గంజాయి పట్టివేత :

### ఇద్దరు అరెస్టు



విజయనగరం : విజయనగరం జిఆర్పి మరియు ఆర్పిఎఫ్ పోలీసులు సంయుక్తంగా విజయనగరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌లపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఒడిశా రాష్ట్రం, కొరాపుట్ జిల్లాకు చెందిన బుడు బరిక మరియు హరీష్ బరిక అనే ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారు ఒడిశా రాష్ట్రం డామన్జోడి ప్రాంతం నుండి కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌కు అక్రమంగా సుమారు రూ 50,000 విలువైన 10 కేజీల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జీఆర్పి వి బాలాజీ రావు కేసు నమోదు చేసి, ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారిని రిమాండ్ నిమిత్తం రైల్వే కోర్టుకు తరలించారు.

## ఆస్తి పన్ను వసూళ్లలో విశాఖ 'విశ్వరూపం



విశాఖపట్నం , : రాష్ట్రస్థాయిలో ఆస్తి పన్ను వసూళ్లలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అగ్రస్థానంలో నిలిచి సత్తా చాటింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను అత్యుత్తమ పురోగతి సాధించినందుకు గాను విశాఖకు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ వేదికగా మున్సిపల్ పరిపాలన విభాగం ఈ పురస్కారాన్ని అందజేసింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్ చేతుల మీదుగా జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఈ ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది విశాఖ పన్ను వసూళ్లలో ఏకంగా 21.5 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం గమనార్హం. గతంలో 510 కోట్ల రూపాయల వసూళ్లు కాగా, ఈసారి అదనంగా 110 కోట్ల రూపాయల వృద్ధి సాధించడం విశాఖ రెవెన్యూ విభాగం పనితీరుకు అద్దం పడుతోంది.ఈ విజయానికి నగర ప్రజలు, ఆస్తి పన్ను చెల్లింపుదారులు అందించిన సహకారమే మూలస్తంభమని కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. పన్ను వసూళ్లలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించడంలో అదనపు కమిషనర్ రమణమూర్తి, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలోని రెవెన్యూ బృందం, ఫీల్డ్ సిబ్బంది సమష్టిగా కృషి చేశారని కొనియాడారు. కేవలం పాత బకాయిలే కాకుండా, కొత్త ఆస్తులను పన్ను పరిధిలోకి తీసుకురావడంలో ప్రత్యేక కార్యాచరణ విజయవంతమైందని వెల్లడించారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కారానికై గంటాకు వినతి

భీమునిపట్నం ప్రజాస్వామ్యం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు గురు వారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కు ఎం వి పి కాలనీ లో ఉన్న అతని క్యాంప్ కార్యాలయంలో ఏ పీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ ( సిఐటియు ) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు ఈ వినతి పత్రంలో కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రాలకు మే నెలంతా వేసవి సెలవులు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్ల కు సంబంధించిన గైడ్ లైన్స్ ఇచ్చిన 5 వ నంబర్ జి ఓ ను సవరించాలని , పెండింగ్ లో ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సర్వేలు,పెన్షన్ల పంపిణీ, బి ఎల్ ఓ డ్యూటీలు తది తర అదనపు పనులు అంగన్వాడీ కార్యకర్త లకు అప్పగించరాదని కోరారు వినతి



పత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకట లక్ష్మి,భీమిలి ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీదేవి, అధ్యక్షులు కె పద్మా వతి, కోశాధికారి కోమలి, వివిధ సెక్టార్ల లీడర్లు శాంత కుమారి, దేవి తది తరులు ఉన్నారు

## అవంతి కళాశాలలో పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రానికి ఉచిత బస్సు సౌకర్యం




తగరపువలస, ప్రజాస్వామ్యం తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25 వ తేదీన జరగబోయే (పాలిటెక్నిక్ ) ఎంట్రన్స్ పరీక్ష రాసే విద్యార్థుల కోసం అవంతి కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నారు. విజయనగరం, విశాఖపట్నం, ఆనందపురం పరిసర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్సు డ్రైవర్స్ ఈశ్వరరావు -- ( బస్ నెంబర్. 14 ) 79977 59839, మేఘాలరావు -- ( బస్ నెంబర్. 15 ) 99855 70078 హనుమంతవాక, విశాఖపట్నం ఉదయం 07:30 మరియు 08:00 గంటలకు, శంకరరావు -- ( బస్ నంబర్. 05 ) 94909 39889 విజయనగరం ఉదయం 07:30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని అలాగే మరిన్ని వివరాలకు పైన తెలిపిన ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### సింహగిరి అన్నదాన

# యజ్ఞానికి లక్ష్యప్రదాత అండ



సింహాచలం, : సింహాచల క్షేత్రంలో కొలువైన వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి పట్ల భక్తులు చాటుకుంటున్న నిరుపమాన భక్తికి నిదర్శనంగా మరో భారీ విరాళం వచ్చి చేరింది. విశాఖపట్నం మహారాణిపేట ప్రాంతానికి చెందిన సీపాన గోపి స్వామి వారి నిత్య అన్నప్రసాద పథకానికి (శాశ్వత అన్నదానం) చేదోడుగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. అక్షరాలా ఒక లక్షా నూట పదహారు రూపాయలను నగదు రూపంలో ఆలయ అధికారులకు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన పర్యవేక్షణ అధికారి సత్య శ్రీనివాస్ సదరు దాతకు సంబంధించిన విరాళం బాండ్‌ను బాధ్యతాయుతంగా అప్పగించారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం సదరు దాతను శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి, అప్పన్న స్వామి వారి దివ్య ప్రసాదాలను అందజేసి మర్యాదలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన యంత్రాంగం, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొనగా, అన్నదాన సేవలో పాలుపంచుకున్న దాతల ఉదార స్వభావాన్ని అధికారులు ప్రత్యేకంగా కొనియాడారు. లోకకల్యాణార్థం సాగుతున్న ఈ సేవలో భక్తులు ఇతోధికంగా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022